www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 11 జనవరి 2025



రేపు ముఖ్యమంత్రి తిరుపతి జిల్లాకు రాక
పర్యటన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈనెల జనవరి 12న ఆదివారం తిరుపతి జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఎజి అండ్ పి గ్యాస్ వారి కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేశ్వర్ రావు, జెసి శుభం బన్సల్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి సిఎం పర్యటించే ప్రదేశాలను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఆర్డీవో తిరుపతి రామ్మోహన్, జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, జిల్లా సివిల్ సప్లై అధికారులు రాజు పాల్గొన్నారు.

గూడూరులో..

సమ్మెకాలపు ఒప్పందాల జీవో జారీ చేయాలి

ప్రజాశక్తి - నాయుడుపేట, గూడూరు టౌన్

సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.ముకుంద మాట్లాడుతూ గత సమ్మెకాలపు ఒప్పందాలకు వెంటనే జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్ 26వ తేదీ నుంచి 2024, జనవరి 11 వరకూ 17 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేశామన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలను ఎదుర్కొని మిలిటెంట్‌గా పోరాటాలు చేశామన్నారు. ఆ పోరాటానికి తలొగ్గి మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతూ గత ప్రభుత్వం జీవో నంబర్ 36ను జారీ చేసిందన్నారు. పారిశుధ్య కార్మికులకు 21వేలు జీతం పెంచిందన్నారు. చెత్త వాహనాల డ్రైవర్లకు 24,500 చేసిందన్నారు. ఇది సిఐటియు పోరాడి సాధించిన విజయం అన్నారు. ఈ సమ్మెకాలంలోనే అనేక హామీలకు రాతపూర్వకంగా ఒప్పందం కుదిరిందనానరు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని చెప్పారన్నారు. రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 62ఏళ్లకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. దహన సంస్కారాలకు 20వేలు ఇస్తామని చెప్పారన్నారు. ఇంజినీరింగ్ కార్మికులూ జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకూ జీవో విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి హామీలకు జీవో విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సీనయ్య, రమణయ్య, ఎన్.శ్యామలమ్మ, చంద్రకళ, రమణయ్య, జయచంద్ర పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల దీక్షలు

గూడూరు టౌన్‌లో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. సిపిఎం నాయకులు జోగి శివకుమార్ సంఘీభావం ప్రకటించారు. నాయకులు శివకుమార్, గోపి, కోటేశ్వరరావు, వెంకట రమణయ్య, రాజేష్, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

కుప్పం, ఏకాదశి బలగాలు వేర్వేరు : డిఐజి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వైకుంఠ ఏకాదశి బందోబస్తుకు సమగ్రమైన ప్రణాళికతో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షేమోషి బాజ్పాయ్ తెలిపారు. శుక్రవారం డీఐజీ విలేకరులతో మాట్లాడుతూ కుప్పం బందోబస్తు, వైకుంఠ ఏకాదశి బందోబస్తుకు వేరువేరుగా పోలీసు బలగాలను నియమించామన్నారు. కుప్పం బందోబస్తుకు వైకుంఠ ఏకాదశికి సంబంధించిన పోలీసు బలగాలను మళ్ళించారనే ఆరోపణలు వాస్తవం కాదన్నారు. తిరుపతిలో 1500 మంది పైగా పోలీసులను వైకుంఠ ఏకాదశి టోకెన్ కేంద్రాల వద్ద భక్తుల భద్రత కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుమల తిరుపతి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి బందోబస్తు కోసం 2424 మంది పోలీస్ బలగాలు విధుల్లో ఉన్నారు. తిరుపతిలో బైరాగపట్టెడ వద్ద జరిగిన ఘటనలో భక్తులు మతి చెందడం చాలా దురదష్టకరం. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి బందోబస్తుకు సంబంధించి పోలీసులను వినియోగించడంలో సంఖ్యాపరంగా కొరత ఏమాత్రము లేదని తెలిపారు. తిరుపతిలో బైరాగపట్టెడ టోకెన్ ఇచ్చు కేంద్రం వద్ద ఒక్కసారిగా ఊహించని విధంగా భక్తుల రద్దీ పెరగడంతో ఈ సంఘటన జరిగిందన్నారు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్నవారు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో, ఈ సంఘటన జరిగినట్టు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. తిరుపతిలో భక్తుల భద్రతకు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులుగా తాము పూర్తి భరోసా ఇస్తున్నామన్నారు.

తొక్కిసలాటపై లోతైన దర్యాప్తు జరగాలి: కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల మంజూరులో జరిగిన తొక్కిసలాటపై లోతైన దర్యాప్తు జరపాలని, తొక్కిసలాటపై వైసీపీ హస్తం ఉందా అని అనుమానాలు కలుగుతున్నాయని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు మతి చెందిన కుటుంబాల వారిని, క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శిస్తుంటే అక్కడికి పెద్ద సంఖ్యలో వారి అనుచరులను తీసుకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏమి సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. వీరి ప్రచార ఆర్భాటాలకు రోగికి పెట్టిన సెలైన్ కూడా పక్కకు నెట్టి ఫోటోలు దిగడం ఏంటని, పరామర్శకు వచ్చారా లేక ప్రచారాలు చేసుకోవడానికి వచ్చారో అర్థం కాలేదన్నారు.

శికారీలకు అటవీ అధికారుల బెదిరింపులు : రాధాకృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల పాపవినాశనంలో అటవీశాఖ అధికారులు శికారీలపై, స్థానికంగా వ్యాపారం చేసుకుంటున్న తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, అనధికారిక దుకాణాలు, టోల్ గేటు వసూళ్లపై ఓ సాధారణ పౌరుడిగా ఆర్టిఐ యాక్ట్ ద్వారా సమాచారం కోరితే భౌతిక దాడులకు తెగబడుతున్నారని రాధాకృష్ణ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా పాపవినాశనం స్థల విశిష్టత తెలిపే బోర్డు తొలగింపుపై వీడియోలు తీసి మీడియాకు ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు కక్ష్యగట్టి తమ వ్యాపార స్థావరాలను ధ్వంసం చేశారన్నారు. పాపవినాశనంలో కొత్త దుకాణాల కేటాయింపు, టోల్గేట్ వసూళ్లు, అభివద్ధి ఖర్చుల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా అటవీశాఖ ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి వచ్చి ఇందుకు సంబంధించిన నకలు పత్రాలను డబ్బులు చెల్లించి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి వెళ్ళగా

అక్కడ విధుల్లో ఉండే అటవీశాఖ ఉద్యోగులు సురేష్, కిషోర్ తమపై దాడికి యత్నించారన్నారు. మొబైల్ ఫోన్ లాక్కొని ధ్వంసం చేశారన్నారు. పాపవినాశనంలో అనధికారిక దుకాణాలను విచారించి తగు న్యాయం చేయాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను కోరారు. రాధాకష్ణకు ఎటువంటి లైసెన్సు పాపవినాశనంలో లేదని అటవీ శాఖ అధికారులు చెప్పారని ప్రజాశక్తి ప్రశ్నించడంతో, తనకు లైసెన్సు లేదు పోనీ, పౌరుడిగా తాను కోరిన సమాచారం అటవీశాఖ అధికారులు ఇవ్వాలి కదా అని బదులిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో వెలియమ్మ, శోభన్ బాబు, బాలాజీ, వెల్లిరాజ, సుందరి పాల్గొన్నారు.

పంట కాలువ పూడ్చివేతపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని న్యూ మంగళం పంచాయతీ మిట్టగాంధీపురం వద్ద ప్రైవేటు వెంచర్ యజమానులు పంట కాలువను పూడ్చివేయడంపై శుక్రవారం స్థానిక రైతులు ఆందోళన నిర్వహించారు. అన్నచెరువు నుండి చెన్నాయగుంట గ్రామ సమీపంలోని మంచినీళ్ల గుంట చెరువును కలుపుతూ ఉన్న పంట కాలవను ఇటీవల కొందరు ప్రయివేటు వెంచర్ యజమానులు సిమెంటు పైపులతో పూడ్చివేశారన్నారు. అయితే అన్న చెరువు నుంచి మంచినీళ్ల కుంటకు నీటి సరఫరా ఆగిపోయిందని, ఆగ్రహించిన చెన్నాయగుంట గ్రామం రైతులు వెంచర్ యజమానుల తీరుపై అభ్యంతరం చెబుతూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఆదేశించినప్పటికీ సదరు వెంచరు యజమానులు పైపులు తొలగించలేదు. దీంతో రైతులే స్వయంగా యంత్రాలను తీసుకొచ్చి పైపులను తొలగించి, నీటి సరఫరాకు మార్గం సుగమం చేసుకున్నారు.

'గోవింద' నామ స్మరణతో...
వైకుంఠ దర్శనం

ప్రజాశక్తి - తిరుమల, యంత్రాంగం

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం శుక్రవారం వేకువజామున గోవింద నామ స్మరణతో ప్రారంభమయ్యింది. శుక్రవారం తెల్లవారుజామున అర్చకులు శ్రీవారికి ఏకాంతంగా అభిషేకాన్ని నిర్వహించారు. పూజాది కైంకర్యాలు ముగిసిన అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించారు. ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ద్వారా సామాన్య భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణ రథంపై ఆలయ తిరు విధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన మిచ్చారు. 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహన మండపంలో ఉత్సవ మూర్తులను భక్తులకు అందుబాటులో ఉంచారు. శుక్రవారం వేకువజాము నుంచి భక్తులను దర్శనానికి టీటీడీ అధికారులు అనుమతించారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు వైకుంఠ ద్వారం వైపు శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారా దర్శనం కోసం ప్రముఖులకు సుమారు 5 వేల టికెట్లను మంజూరు చేశారు. లఘు దర్శనంలో ప్రముఖులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

దర్శించుకున్న ప్రముఖులు వీరే...

తుమ్మలగుంట ఆలయంలో చంద్రగిరి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి

శ్రీవారిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపి స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురాం కష్ణంరాజు, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాందేవ్ బాబా, మంత్రులు అనిత, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, సవిత, సంధ్యారాణి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బండ్ల గణేష్, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, చాముండేశ్వరి నాథ్, పుల్లెల గోపీచంద్ తదితరులు దర్శించుకున్నారు.

తొక్కిసలాట భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం

గాయపడిన వారికి వైకుంఠ దర్శనం కల్పించి ఇళ్లకు పంపించే ఏర్పాట్లలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమలలో స్వర్ణరథంపై శ్రీవారు

తొక్కిసలాట ఘటనలో గాయపడిన భక్తులకు అనుకున్న సమయానికే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వైకుంఠ ద్వార దర్శనాన్ని టిటిడి కల్పించింది. భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ తమకు ముక్కోటి దర్శనం కల్పించిన సిఎం చంద్రబాబుకు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వారి వారి ప్రాంతాలకు వెళ్లేందుకు టిటిడి సొంత ఖర్చులతో వారికి వాహనాలను ఏర్పాటు చేసి పంపించింది.

సామాన్య భక్తులకు ప్రాధాన్యత : అదనపు ఈవో

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సామాన్య భక్తులకే ప్రాధాన్యత ఇస్తున్నామని తిరుమల అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాన్య భక్తులకు సర్వదర్శనం ప్రారంభించామన్నారు. స్లాట్ దర్శనం చేసుకున్న భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగానూ.. ఏర్పేడులోని వికృతమాలలోని శ్రీసంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో, గూడూరులోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, కరణాల వీధిలోని చెన్నకేశవ స్వామి, బాలాజీనగర్‌లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వెంకన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా ఆనందనిలయం, గరుడద్వారం నిలిచాయి. విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు భక్తులకు కనువిందు కలిగించాయి. ఎస్వీయూలో శ్రీవారిని డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి దర్శించుకున్నారు. ఈ ఆలయానికి దాదాపు 8 లక్షల విలువైన గ్రిల్స్‌ను ఏర్పాటు చేయించారని బిసి విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణగౌడ్ తెలిపారు.

డప్పు కళాకారుల సమస్యలపై ర్యాలీ

ప్రజాశక్తి - తడ

తడ మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన డప్పు కళాకారులు శుక్రవారం తడ మండలం తాహసిల్దారు ఆఫీస్ ఎదుట మండల నాయకులు రఘు రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి డిమాండ్లపై తాహసిల్దార్ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. రఘు రెడ్డి మాట్లాడుతూ తడ మండలంలోని డప్పు కళాకారులు అందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ఇచ్చిన ఇంటి పట్టాలకు హౌసింగ్ శాంక్షన్ చేసి కాలనీ కట్టించాలని, ప్రతి ఒక్క డప్పు కళాకారుడికి వ్యవసాయ సాగు భూమి అందజేయాలని, ప్రస్తుతం ఉన్న భూముల్లో పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. తాహశీల్దార్ స్పందించి ప్రతి ఒక్క కళాకారునికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని, ఇప్పటివరకు సాగు భూమి లేని డప్పు కళాకారులను గుర్తించి వ్యవసాయ భూమి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల రాష్ట్ర నాయకులు సుబ్బారావు, సిఐటియు నాయకులు లక్ష్మయ్య, గిరిజన నాయకులు బత్తయ్య పాల్గొన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు: ఆర్టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు వారి స్వస్థలాలకు వెళ్లే క్రమంలో ప్రయాణికుల నుంచి అధిక చార్జీ వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. వాహనాలకు సరి అయిన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిప్పుతున్నా జప్తు చేస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలోని ఐదు కార్యాలయ అధికారులతో కూడిన ప్రత్యేక బందాలతో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 10 రోజులు పాటు ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. వాణిజ్యపరమైన వస్తువులను ప్రజా రవాణా బస్సులలో తరలించకూడదని, ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని, బస్సు నడిపే సమయంలో మద్యం సేవించి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తనిఖీలలో పట్టుబడిన ఎడల తీవ్రమైన చర్యలు తీసుకొని న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

వర్సిటీలో చిరుత కదలికలు వాస్తవమే : ఫారెస్ట్ శాఖ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో చిరుత కదలికలను ప్రత్యేకంగా అమర్చిన 10 కెమెరాల ద్వారా గుర్తించినట్టు ఫారెస్ట్ అధికారులు ఎఫ్.ఆర్.ఓ సుదర్శన్, వన్యప్రాణి జీవశాస్త్రవేత్త సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడును కలిసి చిరుత ఉనికిని నిర్ధారించామన్నారు. రాత్రి ఒంటిగంట సమయంలో జంటలు జంటలుగా తిరుగుతున్నారని, క్యాంటీన్ల వద్ద ఆహార వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేదని, అందువల్ల కుక్కల సంఖ్య పెరిగిందనానరు. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, పాదచారులు, వర్సిటీలోకి వచ్చే బయటి వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి 8 గంటల తరువాత, ఉదయం ఏడు వరకూ వర్సిటీలో తిరగరాదన్నారు. సెక్యూరిటీని పటిష్టం చేయాలన్నారు. జాగ్రత్తల విషయమై అందరికీ సమాచారం అందించాలన్నారు.

వేడుకగా 'వెరిటాస్' వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వెరిటాస్ సైనిక్ పాఠశాల ఐదో వార్షికోత్సవం సందర్భంగా 2025 వెరిటాస్ ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి రూరల్ రామాపురంలోని ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి మాజీ సిబిఐ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండాలన్నారు. అప్పుడే వంద శాతం దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదిగి దేశ అభివద్ధికి సహాయపడతారన్నారు. విద్యార్థులు విలువలను పెంపొందించుకోవాలని, వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులకు మాన్య విలువలను పెంపొందిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. ఆ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బి శేషారెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా దిద్దుతూ ముందుకెళ్తున్నామన్నారు. ఆ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ 17 మందితో ప్రారంభమైన తమ పాఠశాల నేడు 1600 మంది విద్యార్థులకు విద్యాబోధన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ సందీప్ రెడ్డి, డీల్ సిజిహెచ్ ఖాన్, వైస్ ప్రిన్సిపల్ నాగార్జున పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటి

తిరుపతి నార్త్ సెక్షన్ నందు 33/11 కె.వి. అలిపిరి ఫీడర్, 33 కె.వి. స్విమ్స్ ఫీడర్ పరిధిలో 11 కె.వి. హౌసింగ్ బోర్డు కాలని, 11కె.వి. పాలిటెక్నిక్ ఫీడర్, ఈస్ట్ సెక్షన్‌లో సుందరయ్య నగర్, రైల్వే కాలని, ఏడి . బిల్డింగ్, రూరల్ మంగళం సెక్షన్ నందు పిడి. నగర్, తుడ క్వార్టర్స్ , బొమ్మల క్వార్టర్స్ , కోళ్ల ఫారం, మహాలక్ష్మి విలేజ్, పంపు హౌస్, మంగళం విలేజ్, కుర్రపాటి, శివజ్యోతి నగర్, భూపాల్ నగర్, విజయపురం, క్రాంతి నగర్, జర్నలిస్ట్ కాలని , ఎర్ర మిట్ట, రాజీవ్ నగర్ సెక్షన్ నందు ఏమ్ .ఆర్. పల్లి, శ్రీకష్ణ నగర్, ముని రెడ్డి నగర్, పి .వి. నగర్, వైకుంఠ పురం, మారుతి నగర్, వెస్ట్ చర్చ రోడ్డు, తుడ, బి.ఎస్.ఎన్.ఎల్, బైరాగి పట్టెడ, గవర్నమెంట్ స్కూల్ లైన్, సౌత్ సెక్షన్ లో పాత తిరుచనూరు రోడ్డు, అవిలాల మెయిన్ రోడ్డు, భారతీ ఎయిర్టెల్, తిరుచానూరు యోగిమల్లవరం, నియర్ అయ్యప్ప స్వామి ఫీడర్లు మరమ్మత్తులు కారణంగా 11తేది శనివారం నాడు ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.

చింతలపాలెంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -ఏర్పేడు

మండలంలోని చింతలపాలెం గ్రామంలో సిఎంఆర్ అకో అల్యూమినియం కంపెనీ వారిచే మెగా ఉచిత వైద్య శిబిరం సర్పంచ్ బాల ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఎంఆర్ వెల్ఫేర్ ఫౌండేషన్ వైద్య బందంచే ఇసిజి, బ్లడ్ టెస్ట్, యూరిన్ టెస్ట్, ఎక్రే మొదలైన పరీక్షలు చేసి మందులు అందజేశారు. 100 మంది పైగా ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు.

క్షతగాత్రులను పరామర్శించిన వడ్డెర నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల మంజూరులో జరిగిన తొక్కిసలాటలో క్షతగాత్రులను వడ్డెర సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రమణ, శ్రీను, సాంబ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లార్వా సర్వేలు సక్రమంగా నిర్వహించాలి : డాక్టర్ చైతన్య

ప్రజాశక్తి -దొరవారిసత్రం

అన్ని ఆరోగ్య సర్వేలతో పాటు, దోమల నిర్మూలనకు నిర్వహించే లార్వా సర్వేలను సక్రమంగా నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి డాక్టర్ చైతన్య సూచించారు. ఆయన శుక్రవారం ఏకొల్లు విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని కప్పగొడ్డిపాలెం దొరవారిసత్రంలో చేపట్టిన 'ఫ్రైడే- డ్రై డే లార్వా సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం డోరతి, శ్రావణి, ఆశ కార్యకర్త వీరమ్మ, అన్నపూర్ణమ్మ హాజరయ్యారు.

గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పిచ్చాటూరు దళితవాడలో రూ.13.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శుక్రవారం ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధే సిఎం చంద్రబాబునాయుడు ధ్యేయం అన్నారు. పిచ్చాటూరులో రూ.2.30 లక్షలతో నిర్మించిన మినీ గుకులం షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి , మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి. ఇలంగోవన్ రెడ్డి, ఎంపీడీవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు 'కల్కి'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తెలుగు పండుగలు, ప్రత్యేక సందర్భాలను వినోదభరిత కార్యక్రమాలతో మరింత ప్రత్యేకంగా మార్చే జీ తెలుగు ఈ సంక్రాంతికి మూడు ముచ్చటైన కార్యక్రమాలతో వినోదం పంచేందుకు సిద్ధమైంది. నూతన సంవత్సరంలో ప్రత్యేక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించిన జీ తెలుగు తాజాగా కాకినాడలో విక్టరీ వెంకటేష్ అతిథిగా సంక్రాంతి సంబరాలను 'సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం' ఈవెంట్లో వైభవంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలంతో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఈ జనవరి 11, శనివారం సాయంత్రం 6 గంటలకు, పాన్ ఇండియా బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా జనవరి 12, ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు, సంక్రాంతి సంబరాలు ఫైర్ అండ్ వైల్డ్ ఫైర్ ప్రత్యేక కార్యక్రమం జనవరి 13, సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం చేయనుందని జీ తెలుగు నెట్వర్క్ ప్రతినిధులు ప్రకటనలో పేర్కొన్నారు.

పాడి రైతులకు షెడ్లు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట మండలంలో పాడి రైతులకు షెడ్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం టిడిపి నేతలు ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ షెడ్ల నిర్మాణం వేగవంతం చేశారు. అర్హులందరికీ ఉపాధి హామీ పథకం వర్తింపజేస్తాం. తెలుగుదేశం పార్టీ నాయకులు రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మునీబాషా, కన్నా రెడ్డి, జగదీష్ మాట్లాడుతూ వ్యవసాయం, పాడి రైతులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయని సంబరాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు తెలిపారు. పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 30 శాతం రాయితీ ఇస్తామన్నారు. మండలంలో 26 షెడ్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారని తెలిపారు.

హౌసింగ్ దరఖాస్తుకు అర్జీలు స్వీకరణ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో కొత్త హౌసింగ్ అప్లికేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా హౌసింగ్ అప్లికేషన్ దరఖాస్తు చేసుకునేవారు ఆధార్, రేషన్కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ ఇ గోపినాథ్, ఏ ఓ దయాకర్, యుగంధర్ పాల్గొన్నారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లకు తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు ఘన స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం తిరుపతిలోని శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయం, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని వారు దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షులు చిత్తూరు శివశంకర్ పాల్గొన్నారు.

వెస్ట్ వరత్తూరులో వెలిగిన దీపాలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని వెస్ట్ వరత్తూరు పంచాయతీ, కొత్త కండ్రిగ గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ సుధియ దయాకర్ తమ సొంత నిధులతో వీధి లైట్లు వేసేలా చేశారు. సంక్రాంతి సందర్భంగా పంచాయతీలు విద్యుత్ అలంకరణలతో కళకళలాడుతూ ఉండాలని, పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మురళి పాల్గొన్నారు.

పిఎస్యుతో మహిళా వర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్చార్జి విసి ప్రొఫెసర్ వి.ఉమ 'విద్యా సహకారం, మార్పిడి' కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రిన్స్ ఆఫ్ సాంగ్క్లా విశ్వవిద్యాలయం (పి.ఎస్.యు), పట్టాని క్యాంపస్, థాయిలాండ్తో అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు) కుదుర్చుకున్నారు. ఈ ఎంఓయు విద్యార్థులకు ఇంటర్న్షిప్, ప్రాక్టికల్ మార్పిడి, ప్రాక్టికల్, సహకార పరిశోధన ప్రాజెక్టులు, సమావేశాలు, సెమినార్లు, వర్క్షాప్లతో సహా మొబిలిటీ ప్రోగ్రామ్ల మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, డీన్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఆర్.ఉష పాల్గొన్నారు.

భోగి మంటలు.. రంగవల్లులు...!

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పాఠశాలల్లో విద్యార్థులకు సంక్రాంతి సంస్కృతిని పరిచయం చేసేందుకు జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను ముందస్తు జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సంక్రాంతి సంబరాలను విద్యార్థులతో కలిసి జరుపుకోవడం, పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ఇస్తున్నారు.

క్యాంపస్లో... బైరాగిపట్టెడలోని 'వీక్షా ది స్కూల్'లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతికి ముగ్గులు వేయడం, పతంగులు ఎగురవేయడం, మట్టికుండలను తయారు చేయడం, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు చేశామన్నారు. మొదటి పండుగ కావడంతో కోడిపందేలు, కొత్తక్యాలెండర్లు, కొత్త అల్లుళ్లు, కోడళ్లతో ఇళ్లల్లో రంగవల్లులు దిద్ది సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ కెఆర్ విమల పాల్గొన్నారు.

తెలుగువారి సాంప్రదాయ విలువలకు సంక్రాంతి పండుగ ప్రతీకగా నిలుస్తుందని కొండారెడ్డి రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్ సైన్సెస్ కళాశాల సెక్రటరీ వై ఆనంద రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రెండు రోజులపాటు రిమ్స్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. శుక్రవారం కళాశాల ఆవరణలో గంగిరెద్దులు విన్యాసాలు, ముగ్గులతో రంగువల్లలు, భోగి మంటలు అధ్యాపకులు విద్యతో కలిసి సాంప్రదాయ వస్త్రధారణతో నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె ప్రకాష్ రెడ్డి, హెచ్ఒడీలు డా.వి.నిరంజనరెడ్డి, మధుర పాల్గొన్నారు.

తిరుపతి శివజ్యోతి నగర్లోని లిటిల్ ఏంజెల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ రమాదేవి భోగిమంటలతో సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గొబ్బి పాటలు పాడుతూ, సాంప్రదాయ వస్త్రాలతో, ఆనందంగా గడిపారు. పాఠశాల అధినేత రాజగోపాల్ రెడ్డి , డైరెక్టర్ శ్వేతారెడ్డి విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి)లో... కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమి పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. తల్లిదండ్రుల సమక్షంలో భోగిమంటలు వేశారు. భోగిపండ్లతో పిల్లలను దీవించారు. సంఘసేవ తత్పరురాలు లంకెళ్ళ లలిత పాల్గొన్నారు.

గూడూరు టౌన్లో.. పొణకా దంపతులను ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్రెడ్డి, దేవసేనమ్మ దంపతుల సేవలు ఎనలేనివన్నారు. పారిశ్రామికవేత్తగా గూడూరుకు సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలను దంపతులు చేకూర్చారని తెలిపారు. ఐదు వసంతాలు పూర్తి చేసుకోబోతున్న ప్రగతి సేవా సంస్థకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గూడూరు పట్టణంలోని బాలాజీనగర్లో ప్రగతి ఆఫీసునందు నిరుపేదలైన 15 కుటుంబాలకు 18 రకాల ఫలసరుకులను పంపిణీ చేశారు. ఆదిశంకర విద్యాసంస్థల్లో ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.రాజయ్య, డాక్టర్ కె.ధనంజయ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. బోగి మంటలు వేశారు. ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ శివకుమార్రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

తిరుపతి (మంగళం)లో... తిరుపతి – కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాలేజీలో పల్లె వాతావరణం ఉట్టిపడేలా చేశామని డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్రెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో... శ్రీనివాస్తేజ, అక్షర పబ్లిక్ స్కూళ్లలో కరస్పాండెంట్ కొండా ప్రతాప్, సుధాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

పుత్తూరు టౌన్లో... ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పండుగ విశిష్టతను, సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీ సాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులకు పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు టి. నరసింహులు తన తాతగారైన రామయ్య జ్ఞాపకార్థం కళాశాల తాత్కాలిక సిబ్బంది ఎనిమిది మందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ సాధికార సంస్థ కన్వీనర్ డాక్టర్ కందేరి శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి. వీరయ్య పాల్గొన్నారు. కెకెసి హోమియోపతి కళాశాల, వైద్యశాలలో సంక్రాంతి వేడుకలను ఛైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, వైస్ ఛైర్మన్ కె.నరసింహారావు, మంజుల ఆధ్వర్యంలో బ్రహ్మాండంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శరవణన్, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ మగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థులు క్రీడలలోనూ రాణించి మానసిక ఒత్తిడి దూరం చేసుకోవాలని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఇన్చార్జి విసి ఆచార్య జెవి రమణ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని పశువైద్య, డెయిరీ టెక్నాలజీ, మత్స్య కళాశాలలకు సంబంధించి 13వ అంతర్ కళాశాల సాంస్కృతిక, క్రీడా పోటీలను శుక్రవారం వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎస్ వి వెటర్నరీ విశ్వవిద్యాలయం ఇన్చార్జి వీసీ ఆచార్య రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల ఒత్తిడి దూరం చేసుకోవాలంటే క్రీడల్లో పాల్గొనాలని, తద్వారా మానసిక పరిపక్వత పొందగలరని పిలుపునిచ్చారు. వర్సిటీ పరిధిలో విద్యార్థులకు కావలసిన క్రీడా సముదాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో అటువంటి కళాశాలకు సౌకర్యాల లేకపోతే తమ దష్టికి తీసుకువస్తే సౌకర్యాలు అందించేందుకు కషి చేస్తామన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. క్రీడా పోటీలలో తమకు సరిగా సౌకర్యాలు అందించలేదని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన డిగ్రీ కళాశాల క్రీడాకారులు తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్య కళాశాల డీన్ ఆచార్య వీరబ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య జగపతి రామయ్య, కోఆర్డినేటర్లు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

యంబియులో ఘనంగా 32వ వార్షిక క్రీడోత్సవాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి మండలంలోని ఎ. రంగంపేట మోహన్ బాబు విశ్వవిద్యాలయం శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా 32వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ క్యాబినెట్ మంత్రి కొండా సురేఖ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కష్ణంరాజు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. యంబియు కులపతి డాక్టర్ ఎం. మోహన్బాబు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ఛాన్సలర్ మంచు విష్ణు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. విద్యార్థులచే ప్రదర్శింపబడిన కవాతు, కర్రసాము, ఫ్లాగ్ డ్రిల్ వంటి శక్తివంతమైన నైపుణ్యం ప్రదర్శనలు, జాతీయ సమైక్యత, దేశభక్తి అనే అంశంపై విద్యార్థులు చేసిన నత్య ప్రదర్శన ప్రేక్షకుల హదయాలను ఆకట్టుకుంది. క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు ట్రోఫీలు, పతకాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోవోస్ట్ నాగరాజ రామారావు, విసి కరుణా కరణ్, రిజిస్టర్ సారధి, డిఎఫ్ఎ రవిశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా యువ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

స్థానిక ఎస్.కే.ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో శుక్రవారం యువ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 11వ తేదీ నుండి కళాశాలకు వరుసగా సెలవులు రావడంతో 12వ తేదీ నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి వందన సమర్పణ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషిలో మేధస్సు సమానంగా ఉంటుందని, అయితే దానిని సక్రమంగా ఉపయోగించాల్సినటువంటి బాధ్యత ప్రతి ఒక్కరులో ఉండాలని, స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్ మాట్లాడుతూ విద్యతోనే జ్ఞాన సమపార్జన సాధ్యమని, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని సూచించారు. అధ్యాపకులు శ్రీధర్ శర్మ, కే. రవిరాజు, డాక్టర్ పీర కుమార్ తదితరులు ప్రసంగించారు.

సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న నినాదంతో మెప్మా మిషన్ డైరెక్టర్ సూచనతో సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను శుక్రవారం నిర్వహించారు. లైవ్లీ హుడ్ జాతరలో భాగంగా శుక్రవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి జీవనోపాధి చేసుకునే కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు,ప్లంబర్లు, బ్యూటీషియన్, బార్బర్, ఏసీ వాషింగ్ మెషీన్, గ్రీజర్, వాటర్ ప్యూరిఫైర్, టివి మొదలగు టెక్నీషియన్లు దాదాపు వంద మందిపైనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మంజునాధ గౌడ్, మేనేజర్ మణికంఠం పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే సిఎంపై జగన్ విమర్శలు

క్యాంపస్ : ఏకాదశి సందర్భంగా తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్ల మంజూరు విషయంలో రాజకీయ లబ్ధికోసమే సిఎం చంద్రబాబుపై మాజీ సిఎం జగన్మోహన్రెడ్డి విమర్శలు చేస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ విమర్శించారు. వైసిపి హయాంలో విశాఖపట్నం దగ్గర ఎల్జి పాలిమర్స్లో 13 మంది చనిపోయారని, కచ్చులూరు బోటు ప్రమాదంలో 40 మంది చనిపోయారని, అన్నమయ్య జిల్లా రాజంపేటలో 35 మంది ప్రాణాలు వదిలారని, సిఎం హోదాలో అప్పట్లో జగన్మోహన్రెడ్డి ఆయా కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదన్నారు.

క్రైం న్యూస్

తిరుమలలో ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధి తిరుమలలోని జపాలి తీర్థం అటవీ ప్రాంతం వద్ద 150 కేజీల 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్వీఎన్పి ఎఫ్ఆర్ఓ సుదర్శన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై పూర్తిస్థాయి నిఘా ఉంచామని, ముందుగా రాబడిన సమాచారం మేరకు రిజర్వ్ ఫారెస్ట్ లోకి వెళ్ళే అన్ని మార్గాలలో తనిఖీలు చేపట్టమన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు డిఆర్ఓ స్వప్నకుమారి, ఎఫ్బిఓ మురళి, బెస్ట్ క్యాంపు వాచ్ సిబ్బంది జపాలి తీర్థం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారని, అదే సమయంలో తమిళనాడు రిజిస్ట్రేషన్ గల వాహనం ఎర్రచందనం లోడుతో అటువైపుగా వచ్చి వాహన తనిఖీ చేపడుతున్న అటవీశాఖ సిబ్బందిని చూసి కారు విడిచిపెట్టి పారిపోయారన్నారు. పారిపోయిన వారికోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామని ఎఫ్ఆర్ఓ తెలిపారు.

తిరుమల జాపాలి తీర్థం వద్ద పట్టుబడిన దుంగలు

తాగునీటి సమస్యకు నిధులు మంజూరు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

నగరి నియోజకవర్గం వడమాలపేట మండలం టిసి అగ్రహారం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించాలని ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ కృషితో తుడా నిధులు రూ.4.50 లక్షలను మంజూరు చేయించారు. డ్రిల్లింగ్ చేయడంతో నీరు పుష్కలంగా పడడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్

స్థానిక రెడ్డి సంఘం కార్యాలయం నందు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ తాతిరెడ్డి రామకష్ణారెడ్డి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న అన్ని కులాల సంబంధించినటువంటి తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత విద్య వసతి సదుపాయం కల్పి కల్పించడానికి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ముందుండి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ధర్మారెడ్డి యజమానాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అధినేతలు రెడ్డివారి శ్రీధర్ రెడ్డి, ఓం ప్రకాష్ రెడ్డి, కాంట్రాక్టర్ నమిలను ప్రసాదరెడ్డి, అన్నమయ్య జిల్లా బిసి జనరల్ సెక్రెటరీ అనగానే రెడ్డప్ప పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి)

మండలాన్ని పార్టీలకతీతంగా అభివద్ధి చేద్దామని, ఇందుకు అధికారులు అంతా సహకరించాలని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా సమస్యలను సానుకూలంగా విని, త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చేస్తున్న అభివృద్ధిని చూసి వైసిపి నాయకులు సిగ్గు పడుతున్నారన్నారు. గత పదేళ్లలో పంచాయతీలలో పన్నులు వసూలు చేశారే తప్ప, అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పిటిసి యుగంధర్, తహసిల్దార్ శివరాం సుబ్బయ్య పాల్గొన్నారు.

డా.సోమనాథ్ దాస్ 'నరేంద్ర ఆరోహణం' కావ్యరచన

ప్రజాశక్తి - క్యాంపస్

జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం అసోషియేట్ ప్రొఫెసర్ సోమనాథ్ దాస్, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగాధ్యాపకులు భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదరదాస్ మోదీ జీవిత చరిత్ర ఆధారంగా పన్నెండు ఖండాలు, దాదాపు 1200 శ్లోకాలతో "నరేంద్ర ఆరోహణం" అనే మహాకావ్యాన్ని రచించారు. ఆయన చిన్ననాటి నుండి, గుజరాత్లో తన వినయపూర్వకమైన జీవన ప్రారంభం నుండి ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలం వరకు, ప్రస్తుత ప్రధానమంత్రిగా మొదలగు అన్ని విషయాలలో ఆయన చేసిన రాజకీయ ప్రయాణం గురించి ఈ మహాకావ్యంలో వర్ణించారు. గుజూరాత్లోని శ్రీసోమనాథ్ సంస్కత విశ్వవిద్యాలయం అంబాజీలో జరిగిన యూత్ ఫెస్టివల్లో ప్రధానమంత్రిపై రచించిన ఈ మహాకావ్యాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విసి జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి సోమనాథ్ దాస్ను అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.జె.రమాశ్రీ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా సుగుణావతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బీసీ ఉద్యోగుల 19వ మహా సభను విజయవంతం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా చెరుకుల సుగుణావతిని నియమించి కండువా కప్పి సత్కరించారు. పార్లమెంటులో బీసీ మంత్రిత్వ శాఖకు సంబంధించి బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జగన్నాథం, జల్లి మధుసూదన్ పాల్గొన్నారు.

పుత్తూరు పురపాలక సంఘము మునిసిపల్ కార్యాలయం, పుత్తూరు, తేది:10.01.2025

'ఇ' ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు ఆర్.ఓ.సి. నెం.2129/ఇ1/2024

పుత్తూరు పురపాలక సంఘము నందు General Funds నుండి 7 పనులకు గాను (టెండరు నిట్ నెం.46/2024-25 to 52/2024-25) అర్హతలు కలిగినవారు నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను. http://tender.apeprocurement.gov.in

కమీషనరు
పుత్తూరు పురపాలక సంఘం